18న ఆర్చరీ టోర్నమెంట్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్-14, 17, 19 బాలి బాలికల ఆర్చరి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 18న దోమకొండ పోర్టల్‌లో జరగనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్ తెలిపారు. ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయగలరని తెలిపారు. బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని తెలిపారు. మిగతా సమాచారం కోసం 94900 15388కు సంప్రదించాలన్నారు.

నిజాంసాగర్ వరద గేట్ల మూసివేత


నిజాంసాగర్ వరద గేట్లు మూసివేసిన దృశ్యం

» 54 రోజుల తరువాత విరామం

నిజాంసాగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 54 రోజుల పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగింది. బుధవారం ఉదయం నుంచి నీటి పారుదల శాఖ అధికా రులు గేట్లను మూసివేసి నీటి విడుదలను నిలిపివేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోని 289.184 టీఎంసీల నీరు వస్తుండగా దిగువ మంజీరాకు 260.9.922 టీఎంసీల నీటిని విడుదల చేశారు. 54 రోజులుగా నిజాంసాగర్ నీటి విడుదల కొనసాగింది. ఈ ఏడాది ఆగస్టు 18 నుంచి అక్టోబరు మొదటి వారం వరకు భారీ వర్షాలు కురిశాయి. సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 1405 అడుగులకు నిల్వ చేశారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో 17.802 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రధాన కాలువ వెంట బుధవారం వరకు 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి విడుదలను నిలిపివేయడంతో వరద గేట్ల పరిసరాల ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మిగిలాయి. ఈ ఏడాది వర్షాకాలం ఆయకట్టు కింద 1,35,000 ఎకరాలలో సిరులు పండుతున్నాయి. యాసంగి సాగుకు నీటి కొరత ఉండదని డిప్యూటీ ఈఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఘోరం

రాంగ్ రూట్లో దూసుకొచ్చిన మృత్యువు

- స్కూటీని ఢీకొన్న టిప్పర్
- తీవ్ర గాయాలతో ఒకే కుటుంబంలో ముగ్గురి దుర్మరణం
- మరో బాలుడు చికిత్స పొందుతూ మృతి
- భిక్కనూరులో ఘోర రోడ్డు ప్రమాదం


రోడ్డు ప్రమాదం కారణంగా నిలిచిన వాహనాలు


ప్రమాదానికి కారణమైన టిప్పర్

భిక్కనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్కూటీని రాంగ్ రూట్లో దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొనడంతో నలుగురు మృతి చెందిన దుర్ఘటన భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. మూడు నెలల వయసున్న మనవడికి వ్యాక్సిన్ ఇప్పిద్దామని వెళుతున్న క్రమంలో మృత్యువు టిప్పర్ రూపంలో వారిని కబళించింది. పోలీసులు, స్థానికులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పాస్టర్‌గా పని చేస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన బాల్‌కిషన్(53) భార్య గత కొన్ని సంవత్సరాల క్రితం మరణించింది. అప్పటి నుంచి కామారెడ్డిలోని షాబ్దీపూర్ రోడ్డులో తన తల్లిదండ్రులతో అద్దెకు ఉంటున్నాడు. తన కూతురు జాస్లిన్(29)ను ఖమ్మం జిల్లాకు చెందిన పాస్టర్ ప్రకాష్‌తో గత ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిపించగా వీరికి జోయల్ ప్రకాష్(4), జోయల్ జడ్సన్(3 నెలలు) ఉన్నారు. 20 రోజుల క్రితం జాస్లిన్ తన తండ్రి బాల్‌కిషన్ వద్దకు రాగా బుధవారం ఉదయం చిన్న బాబుకు భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ ఇప్పించేందుకు స్కూటీపై వెళుతున్నారు. స్కూటీని బాల్‌కిషన్ నడుపుతుండగా వెనక జాస్లిన్‌తో పాటు ఆమె ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతి చెందిన బాల్‌కిషన్, జాస్లిన్(ఫైల్)


జోయల్(ఫైల్)


జడ్సన్(ఫైల్)

వాహనం భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో బాల్‌కిషన్, జాస్లిన్, జోయల్ ప్రకాష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా జడ్సన్ అనే బాలుడు కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా దాదాపుగా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

అయ్యో బిడ్డా.. ఎంత పనైపాయే...

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం గ్రామంలో తెలియగానే గ్రామస్థులు పెద్దఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను చూసి అయ్యో బిడ్డా ఎంత పనైపాయే అంటూ గ్రామ మహిళలు, (మిగతా 10వ పేజీలో)

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

» న్యాయాధికారి నాగరాణి

మద్నూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి నాగరాణి అన్నారు. బుధవారం మద్నూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, పెద్దఎక్లారా బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చట్టాల గురించి తెలిపారు. మహిళల కోసం వరకట్న నిషేధ చట్టం 1961, గృహ హింస నిరోధక చట్టం 2005, లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం 2013, మహిళల అక్రమ రవాణా చట్టం 1956, ఆస్తిపై హక్కు చట్టం 1986, బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, ఎవరైన బాల్య వివాహాలు చేసినట్లయితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద జైలు శిక్ష విధించబడుతుందన్నారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. బాలికలు ఉన్నత చదువులు చదివి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద న్యాయాధికారి వినీల్‌కుమార్, డీసీపీవో స్రవంతి, వైద్యాధికారిని తులసి, మండల విద్యాధికారి రాములు, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యశీల, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, సభ్యులు సురేష్, అశోక్ పాల్గొన్నారు.


మద్నూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో మాట్లాడుతున్న న్యాయాధికారి నాగరాణి


భిక్కనూరు గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

వేతనాలు చెల్లించాలని

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ధర్నా

భిక్కనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమకు రావాల్సిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో దసరా పండుగను సైతం నిర్వహించుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం హెచ్ఎం రఘుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో వర్షం దడ

- సీసీఐ కోసం ఎదురు చూపులు
- సోయా కొనుగోలు ఎప్పుడు?


9

కొనుగోలు కేంద్రాలను సురక్షిత ప్రాంతాల్లో

ఏర్పాటు చేయాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

- 5.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం
- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 5.98 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకాటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావులతో మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని నీరు నిలిచే, వరద ముంపు లేదా తక్కువ నేల ప్రాంతాల్లో పీపీసీలు నిర్వహించరాదని, అన్ని పీపీసీలలో టార్పాలీన్లు, మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, డిజిటల్ గ్రెయిన్ కాలిపర్స్, హస్క్ రిమువర్స్, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్‌లు, పవర్ బ్యాకప్ వంటి అవసరమైన మౌలిక వసతులు పూర్తిగా సిద్ధం చేయాలని, రైతులకు అనుకూలంగా నీడ, తాగు నీరు, మరుగుదొడ్లు, కూర్చునే వసతులు, సరిపడ హమాలీ కార్మికులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులకు చెల్లింపులు 48 నుంచి 72 గంటలలోపు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని తెలిపారు. ఉరుములు, మెరుపులు, అనుకోని వర్షాలు లేదా గాలి వానల కారణంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీపీసీ వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా పంట కోత పర్యవేక్షణ చేసి పీపీసీ వద్ద రద్దీ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రమాణాల ప్రకారం వరి నాణ్యత ధ్రువీకరణ చేయాలని, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసి స్టాక్ నిల్వ లేకుండా సమయానుకూలంగా ధాన్యం సరఫరా చేయాలని అన్నారు. హార్వెస్టర్ యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించి కోత విధానాలను పాటించాలని తెలిపారు. జిల్లా కంట్రోల్ రూం నెంబర్ 08468-220051, రాష్ట్రస్థాయి టోల్ ఫ్రీ నెంబర్లు 18004250 0333, 180042501967 రైతులు సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్‌డీఓ సురేందర్, పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఎం సివిల్ సప్లయ్ శ్రీకాంత్, డీఏఓ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల త్వరగా నిర్మించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం ఆయా మండల అధికారులతో వీసీలో మాట్లాడారు. నిరుపేద ప్రజలు సౌకర్యవంతంగా సొంత ఇంటిలో నివసించాలనే కలను సహకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకంను ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాకు మంజూరు చేసిన అన్ని ఇళ్ల నిర్మాణాలు కచ్చితంగా ప్రారంభమై నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో మొత్తం 11,679 ఇళ్ల నిర్మాణాలను మహిళల పేరున అప్రూవల్ ఇవ్వడం జరిగిందని, వివిధ మండలాల్లో జరుగుతున్న ప్రగతి మరింత వేగంగా జరగడానికి మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని, ఎంపీడీవోలు, ఎంపీవోలు పర్యవేక్షణ చేయాలని, జిల్లా స్థాయి అధికారులు కూడా వారికి మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. సాంక్షన్ చేయబడి ఇప్పటి వరకు ప్రారంభం కాని ఇళ్లకు వెంటనే మార్క్‌అవుట్ ఇవ్వాలని, మార్క్‌అవుట్ ఇచ్చిన ఇళ్లలో బేస్మెంట్ లెవల్‌కు వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాబోయే 15 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన అన్ని స్టేజీల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల అభివృద్ధిని కనబరచాలని ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఐకేపీ ఆర్థిక సహాయం అందించాలని (మిగతా 10వ పేజీలో)

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రజినికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైని ఫార్మాసిస్ట్, ఫార్మా అసిస్టెంట్, రిటైల్‌ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూమ్ నెంబర్ 121కు రావాలని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వారు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు రెండు సెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్‌లకు సంబంధిత సబ్జెక్ట్‌లో పాసై ఉండాలని, ఫార్మాసి అసిస్టెంట్, రిటైల్‌ట్రైనీ అసిసోసియేట్‌లకు పదో తరగతి అర్హత ఉండాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 72079 17714, 76719 74009 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పోలీసు ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నది

» ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగం బాధ్యత, సేవతో కూడుకున్నదని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. బుధవారం కామారెడ్డి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి కొత్త రికార్డు రూంను ప్రారంభించారు. ప్రతీ అధికారి తన పరిధిలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో వ్యవహరించాలని తెలిపారు. గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని అవసరాన్ని బట్టి టెక్నికల్ సపోర్టు వినియోగించుకోవాలని, సర్కిల్ పరిధిలోని పోలీసుస్టేషన్‌లను తరచూ సందర్శించి కేసుల పురోగతిని సమీక్షిస్తు ఎస్‌హెచ్‌ఓలకు మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. సర్కిల్ పరిధిలోని కేడీ, సస్పెక్ట్, రౌడీ షీటర్ల కదలికలను క్రమం తప్పకుండా పరిశీలించి వారి కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆస్తి సంబంధిత నేరాలు చోటు చేసుకునే ప్రాంతాలను క్రైమ్‌హాట్ స్పాట్స్‌గా గుర్తించి నిఘా బలపరచాలని సూచించారు. రోడ్డుప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి ర్యాంబుల్‌స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు, సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు వంటి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నిరోధానికి, నేరాల చేధనకు సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు. డయల్ 100కు కాల్ అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. బ్లూకోర్ట్, పెట్రోల్, వాహనాలు 24 గంటలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ రాజ్‌పాల్

పార్టీ బలోపేతం కోసం

పని చేసిన వారికే డీసీసీ పీఠం

» ఏఐసీసీ అబ్జర్వర్, రాజ్యసభ ఎంపీ రాజ్‌పాల్

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కోసం పని చేసిన వారికే డీసీసీ అధ్యక్ష పదవి ఉంటుందని ఏఐసీసీ అబ్జర్వర్. రాజ్యసభ సభ్యుడు రాజ్‌పాల్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలోని స్నేహ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం డీసీసీ అధ్యక్ష పదవి కోసం నియోజకవర్గం నుంచి ఏడుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు అనంతరం ఓట్ చోర్ గద్దె చోడ్ రాహుల్ గాంధీ పోరాటానికి ప్రజా మద్దతుగా యూత్ కాంగ్రెస్ నాయకులు చేపట్టిన సంతకాల సేకరణలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్ రావు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే వారికి పదవులు వస్తాయన్నారు. కార్యకర్తల పనితీరును అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులు నిర్వహించని వైద్యురాలిపై

సబ్ కలెక్టర్ ఆగ్రహం


ఆసుపత్రిలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ఉమ్మడి మండలమైన మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పల్లె దవాఖానాను బుధవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు. డాక్టర్ ఆయేషా అందుబాటులో లేకపోవడంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రికార్డులు సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాల నమోదు రిజిస్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన డాక్టర్‌పై చర్య తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌కు సెల్‌ఫోన్‌లో మాట్లాడి సిఫారసు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించాలని విధి నిర్వహణకు వచ్చే ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వచ్చినట్లయితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. 765డీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో తహసీల్ కార్యాలయంలో మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో పారిశుధ్యం పట్ల అలసత్వం వహించరాదని ఆమె అన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాల్వల్లో చెత్తాచెదారం నిలిచినట్లయితే శుభ్రం చేయించాలని అన్నారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి వెంట తహసీల్దార్ లత, ఎంపీడీవో సత్యనారాయణ (మిగతా 10వ పేజీలో)

అర్ధాంతరంగా నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులు

- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

10లో..



యూనియన్ బ్యాంకుకు తాళం

- నెట్‌వర్క్, కరెంట్ లేకపోవడంతోనే మూసివేశామన్న సిబ్బంది
- ఇబ్బందులు ఎదుర్కొన్న ఖాతాదారులు

10లో..



క్రైం సమాచారం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

» ఇటీవల అనారోగ్యంతో తల్లి, ప్రస్తుతం తండ్రి మరణం

» అనాథలైన ఇద్దరు పిల్లలు



పిల్లలతో లక్ష్మణ్ (ఫైల్‌ఫోటో)

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి కరెంట్ పోలును ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన వెల్లుట్లలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మణ్(32) వెంకటాపూర్ గేటు ప్రధాన రహదారిపై హనుమాన్ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి కరెంట్ పోలును ఢీకొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల అతడి భార్య అనారోగ్యంతో మరణించిందని స్థానికులు తెలిపారు. తల్లి, తండ్రిని కోల్పోవడంతో పిల్లలు అనాథలుగా మారారని గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు కిందపడి ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య

సుభాష్‌నగర్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):జీవితంపై విరక్తి చెంది ట్రాన్స్‌జెండర్ మీరా రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. జిల్లాకేంద్రంలోని నిజామాబాద్-జాన్కంపేట్ రైల్వే ట్రాక్ మధ్యలో బుధవారం ఎదురుగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో కొంతకాలం నుంచి నివాసం ఉంటున్న మీరా అనారోగ్య సమస్యలతో బాధపడుతుందని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతో రైలు కింద పడినట్లు వివరించారు.

బస్సు కిందపడి విద్యార్థికి తీవ్ర గాయాలు

భీమ్‌గల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూ బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు టైర్ కిందపడి విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న బాబాపూర్‌కు చెందిన హయాత్(20) కళాశాల పూర్తికాగానే బైక్‌పై తన ఇంటికి వస్తుండగా బస్టాండ్ వద్ద ముందున్న ఆర్టీసీ బస్సు పక్కనుంచి వెళ్తున్నాడు. అదుపుతప్పి టైర్ కిందపడడంతో కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా.. సకాలంలో రాకపోవడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రైవేట్ వాహనంలో బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ..

తాడ్వాయి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు. తాడ్వాయి నుంచి లింగంపేట వైపు వెళ్తున్న ముంజ సాయిలు కారును ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తి వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో బైక్‌పై ఉన్న పుల్లూరు శ్రీకాంత్, బుర్ర శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

కోటగిరి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండు పేకాట స్థావరాలపై బుధవారం దాడులు చేసి, 17మంది పేకాటరాయుళ్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. మండలకేంద్రంలోని రంజని రిక్రియేషన్ క్లబ్‌లో పేకాట కేంద్రంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.13,610 నగదు, 5 సెల్‌ఫోన్‌లు, 2 మోటార్ సైకిళ్లను సీజ్ చేశామన్నారు. మండల కేంద్రంలోని మరో వ్యక్తి ఇంట్లో పేకాట కొనసాగుతుందన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఇందులో ఒకరు తప్పించుకోగా ఇంటి యాజమానితో పాటు 12మంది కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.15,190 నగదుతో పాటు 10మొబైల్స్, 6 మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు చెప్పారు.

సాలూర,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఖాజాపూర్ శివారులో మంగళవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు బోధన్ రూరల్ ఎస్‌ఐ మహేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి స్థావరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతూ ముగ్గురు పట్టుబడ్డట్లు ఎస్‌ఐ వెల్లడించారు. వారి నుంచి రూ.15,040 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

నసురుల్లాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి, వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.1250, 2బైకులు, 4ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శివాలయంలో హుండీ చోరీ

నవీపేట,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని శివపంచాయతన శివాలయంలో మంగళవారం రాత్రి దుండగులు హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. దొంగలు ఆలయ ఆవరణలోకి ప్రవేశించి హుండీని ధ్వంసం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 10 నెలలుగా హుండీ తెరువలేదని, దీనికి సంబంధించి సుమారు రూ.40వేల నగదు చోరీకి గురై ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. దీనిపై బుధవారం నవీపేట పోలీసులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైన్స్‌షాపులో జరిగిన దొంగతనం కేసును 2రోజుల్లో ఛేదించినట్లు సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ మహేష్ బుధవారం తెలిపారు. పట్టణకేంద్రంలోని త్రిశూల్ వైన్స్‌లో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని సీసీకెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోసన్‌పల్లికి చెందిన నర్సింలు ఈ చర్యకు పాల్పడగా.. నేరస్థుడు కూలి డబ్బులు సరిపోకపోవడంతో వైన్స్ షాప్‌లో చోరీ చేసినట్లు తెలిపారు. అతడి నుంచి ఇనుపరాడ్, రూ.8500లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు

రెంజల్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్‌కు చెందిన అకమత్ బేగ్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సాటాపూర్‌కు చెందిన బేగ్ బోధన్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదని, ఉదయం తల్లిదండ్రులు చదువుకోవడం లేదని మందలించడంతో ఉదయం 8గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి రాలేదన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతకగా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి అలీ బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాంధారి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పత్తి బాల్‌రాజు 2రోజులుగా కనిపించడం లేదని ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిన బాల్‌రాజు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన మృతదేహం

» మృతుడు ఆర్మూర్ వాసిగా గుర్తింపు.. ఆత్మహత్యగా నిర్ధారణ

మల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్‌కు చెందిన జోరిగే గంగాధర్(35) మృతదేహం బుధవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని కొత్తధాంరాజుపల్లి శావారులోని గోదావరి నదిలో గుర్తించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగే గంగాధర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా నష్టపోయిన గంగాధర్ అప్పు ఎక్కువడంతో ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 10న సోన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా భార్య మౌనిక మృతదేహం పరిశీలించి భర్త జోరిగే గంగాధర్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిజామాబాద్ అడిషనల్ డీసీపీ, ఏసీపీ

జక్రాన్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించి తల్లిదండ్రులకు పేరు మంచి తేవాలని నిజామాబాద్ అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి అన్నారు. జక్రాన్‌పల్లిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2రోజుల పాటు జరిగే మండలస్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం అడిషనల్ డీసీపీ బస్వరెడ్డి, ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో ఓటమి పాలైతే గెలుపు విలువ తెలుస్తుందన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్, ఏఎస్‌ఐ శంకర్, ఎంఈవో శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఎంపీవో యూసుఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచ్‌లు నర్సారెడ్డి,బాలకిషన్,చిన్నసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ బాలికల పాఠశాల తరలింపు

» సౌకర్యాల లేమితో ధర్పల్లికి మార్పు



విద్యార్థినులను తరలిస్తున్న అధికారులు

సిరికొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీమన్‌పల్లిలో ఎంజేపీ బీసీ బాలికల గురుకుల పాఠశాలను భారీ పోలీస్ బందోబస్తు మధ్య బుధవారం విద్యాశాఖ అధికారులు ధర్పల్లికి తరలించారు. ఏడేళ్లుగా చీమన్‌పల్లిలో నిర్వహిస్తున్న పాఠశాలను సౌకర్యాల లేమి పేరుతో ధర్పల్లికి తరలించడం తగదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. చీమన్‌పల్లికి నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ 2017లో బీసీ బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయించారు. ఏడాది పాటు నిజామాబాద్‌లో పాఠశాలను నిర్వహించారు. 2018-2025 అక్టోబరు 14 వరకు గ్రామంలో పాఠశాలను కొనసాగించిన అధికారులు బుధవారం అర్ధాంతరంగా పాఠశాలను ధర్పల్లికి తరలించడంలో అంతర్యం ఏమిటని చీమన్‌పల్లి గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కాగా చీమన్‌పల్లిలో గల పాఠశాల గదిలో తరగతి గదుల, డార్మెటరీ ఒకే చోట ఉండడం విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాలతోనే పాఠశాలను తరలించినట్లు ప్రిన్స్‌పాల్ భాగ్యలక్ష్మి తెలిపారు. పాఠశాల సామగ్రిని తరలిస్తున్న సమయంలో ధర్పల్లి, డిచ్‌పల్లి, సీఐలు, సిరికొండ, ధర్పల్లి, ఇందల్‌వాయి ఎస్సైలు రామకృష్ణ, కళ్యాణి, మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పల్లెపల్లెకు న్యాయ విజ్ఞాన ప్రచారం



న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన చట్టాల విజ్ఞానపు విత్తనాలు చల్లుతున్నామని, వాటిని గ్రామస్థులు సంరక్షించుకోవాలని ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నాగన్‌పల్లిలో న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు న్యాయ విజ్ఞానంపై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం తీసుకోవడానికి లభించిన అమృత కలశమన్నారు. ప్రతి పౌరుడికి చట్టాల ప్రతిఫలాలు చేరే విధంగా సంస్థ శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, సమ్మయ్య, న్యాయవాదులు హన్మంత్ రావు, నారాయణ, బోధన్ సీఐ విజయ్‌బాబు, ఎస్‌ఐ మశ్చేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి అజర్, ప్రభుత్వ ప్లీడర్ గౌసోద్దీర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగేలా ఏర్పాట్లు

» కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల బుధవారం వీసీలో ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు. జిల్లాలో ఈసారి ఖరీఫ్‌లో 4.37లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, 12లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలలో ధాన్యం దిగుబడులు వస్తున్నందున ఇప్పటికే జిల్లాలో274 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఈ కేంద్రాలలో ధాన్యం సేకరణ జరిపేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత సీజన్‌లో 606 కేంద్రాలు ఉండగా, ఈసారి 676 కేంద్రాలను నెలకొల్పుతున్నామన్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. కాగా, జిల్లాకు 1582 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని కలెక్టర్ కోరారు. పొరుగు ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు శాఖ జిల్లా యంత్రాంగంతో సమన్వయం ఏర్పర్చుకుని సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్‌ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, డీసీఓ శ్రీనివాస్, డీటీఓ ఉమా మహేశ్వర్ రావు, మార్కెటింగ్ ఏ.డీ గంగవ్వ, తూనికలు కొలతల శాఖ అధికారి సుజాత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అందరి అభిప్రాయాలతోనే అధ్యక్షుడి నియామకం

» ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోని అందరి అభిప్రాయాలతోనే డీసీసీ అధ్యక్షుడి నియామకం చేపడుతామని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమా వేశంలో జిల్లా అధ్యక్షుడి నియామకం కోసం పార్టీలోని జిల్లాస్థాయి సీనియర్ నాయకులు ఆశావాహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తదనాంతరం హైకమాండ్‌కు నివేదిక అందజేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పీసీసీ కార్యదర్శి నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ మార చంద్రమోహన్, పట్టణ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబా బాగౌడ్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఇట్టెం జీవన్, పండిత్ పవన్, అయ్యప్ప శ్రీనివాస్, డేగ పోశెట్టి, బాబా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుంది



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

ఆర్మూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ అన్నారు. ఆలూర్, దేగాం, మచ్చర్ల గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కోనుగోలు కేంద్రాలలోనే ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు ప్రమోద్, సంతోష్‌రెడ్డి, రాజేశ్వర్, నర్సయ్య, నర్సారెడ్డి, నాగన్న, బోజారెడ్డి, సాయరెడ్డి, గోవర్ధన్, గంగాధర్, సీఈవో మల్లేష్, వీడీసీ అధ్యక్షుడు సూర్యరెడ్డి, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మాక్లూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో పాటించవల్సిన అంశాలను సిబ్బందికి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రత్యేకాధికారి స్వప్న, పీఏసీ చైర్మన్ భూరోల్ల రజిత అశోక్, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాశాఖ అధికారి పద్మ, సంఘ కార్యదర్శి ప్రవీణ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేందాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మోర్తాడ్ , అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలోనే రైతులు వరిధాన్యాన్ని విక్రయించాలని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2389 రూపాయలు, బి గ్రేడ్ రకానికి 2369 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. వడ్యాట్, సుంకెట్ గ్రామాలలో కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుంకెట ముత్తెన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, లక్ష్మ, రంజిత్, నవీద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్మాజి గోపి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, స్థానిక నాయకులు మోహన్, కొమిరె శ్రీధర్, ఐకేపీ సీసీలు శ్రీనివాస్, మహేందర్, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వంద స్తంభాల గుడికి రండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అతి పురాతన వంద స్తంభాల గుడి ఇంద్రనారాయణ మందిరాన్ని సందర్శించాలని ప్రముఖ జ్యోతిషులు, ధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్ మహరాజ్‌తో పాటు యువకులు సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. పట్టణంలో ఉన్న వంద స్తంభాల గుడిలో చారిత్రాత్మక శిలాశాసనం ఉందని, బోధన్ పట్టణ ప్రజల కోరిక మేరకు వంద స్తంభాల గుడిని పరిశీలించాలని, అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

వర్ని,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల 3నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం వైద్యాధికారిణి పద్మజకు వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా ఒకటవ తారీఖున వేతనాలు చెల్లించేలా జిల్లా ఉన్నతా ధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు సురేష్ కోరారు. కార్యక్రమంలో దేవిసింగ్, గంగాధర్, సుమన్, మాధవి, నర్సింగ్, సాయిలు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై సమీక్ష

వర్ని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం బోధన్ డీఎల్పీవో నాగరాజు సమీక్ష ఏర్పాటుచేశారు. వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ పంచాయతి కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పన్నుల వసూళ్ల, ఆన్‌లైన్ రశీదు నమోదుపై వివరణ ఇచ్చారు. కంపోస్టు ఎరువు తయారు విధానంపై క్లుప్తంగా వివరించారు.

స్థల పరిశీలన

సాలూర,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడానికి బుధవారం తహసీల్దార్ శశిభూషణ్ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఎంపీ నిధుల కింద ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.4లక్షలు మంజూరైనట్లు తహసీల్దార్ వెల్లడించారు. నిధులు మంజూరు చేసిన జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్‌కు మండల ప్రజల తరఫన బీజేపీ మండల అధ్యక్షులు గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాలూర పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్, గ్రామ పెద్దలు గంగారాం, గంగారాం, ప్రకాష్, సాయిరెడ్డి, బ్రహ్మ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన కలిగి ఉండాలి

ఏర్గట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ చేస్తున్న విధులపై ప్రతీ విద్యార్థిపై అవగాహన ఉండాలని ఎస్సై పడాల రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 15 నుండి 21 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతన్న విద్యార్థులు పాల్గొనగా వారికి స్టేషన్‌లోని పరికరాలపై, సీసీ కెమెరాల నిర్వహణ, ట్రాఫిక్ గాడ్జెట్‌లపై వివరించారు. సైబర్ క్రైమ్, డయల్ 100, 112 సేవలు, మహిళల షీటీమ్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

భీమ్‌గల్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గంజాయి డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎస్సై సందీప్ తెలిపారు. బుధవారం సైబర్ సురక్ష జాతీయ భద్రత, మత్తు పదార్థాల నివారణ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, సత్యనారాయణ, ఎస్సై సత్తార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలతోనే భరోసా

కమ్మర్‌పల్లి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):కారుణ్య నియామకాలతో ఐకేపి సిబ్బందికి భరోసా ఏర్పడుతుందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ అన్నారు. ఏర్గట్ల మండలంలో విధులు నిర్వర్తిస్తు ఇటీవల అకాల మరణం పొందిన కమ్మర్‌పల్లికి చెందిన ఐకేఈ సీసీ రాజేశ్వర్ కుటుంబానికి ఐకేపీ జిల్లా ఉద్యోగ సం ఘాలు, సిబ్బంది ద్వారా విరాళాలుగా సేకరించిన 75 వేలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ జిల్లా ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ మాణిక్యం, ఐకేపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి శేఖర్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారులు ప్రభాకర్, సృజన్‌కుమార్, రవి, విఠల్, ముఖీమ్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

జేఏసీ కన్వీనర్‌గా రవీందర్ యాదవ్

బోధన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక కోసం పట్టణంలో బుధవారం జేఏసీని ఏర్పాటుచేశారు. సమావేశంలో బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్‌గా గాండ్ల రవీందర్ యాదవ్, వర్కింగ్ చైర్మన్ సుధాకర్‌చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోకన్వీనర్‌గా అశోక్‌రెడ్డి, గంగాధర్ గౌడ్, సంతోష్, పవన్‌కుమార్, నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, హన్మాండ్లు చారి, అశోక్ గౌడ్, సంజుపటేల్, అశోక్ చారి, శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా లింగన్న, బుజ్జి, గంగారెడ్డి, సత్యనారాయణ, రాములు, మాధవ్ గౌడ్, కోకన్వీనర్‌గా రవి, శంకర్‌ను ఎన్నుకున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కోటగిరి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో బుధవారం పలు ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేశారు.

అదనపు వసూళ్లకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల వద్ద వేయి బీడీలకు అదనంగా రూ.10 వసూలు చేసే పద్ధతికి స్వస్తి పలకాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న అన్నారు. బుధవారం పట్టణంలోని కుమార్ నారాయన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న కుటీర పరిశ్రమ కార్మికుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని చట్టవిరుద్ధంగా దేశాయి బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం వేయి బీడీలకు రూ.10 తక్కువగా ఇస్తు ముడిసరుకు తుట్టిని కార్మికులు కొనుగోలు చేసి బీడీలు చేసి ఇవ్వాలనేది చట్ట వ్యతిరేక చర్య అవుతుందన్నారు. బీడీ యాజమాన్యం తినుబండరాలను బీడీ కార్మికులు కొనుగోలు చేసేలా బలవంతంగా అంటగట్టే పద్ధతి సమంజసం కాదన్నారు. పద్ధతులు మార్చుకోకపోతే రేంజ్ ఆఫీసును కార్మికులతో ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, శ్రీనివాస్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులివ్వండి



ఎంపీ అరవింద్‌కు వినతిపత్రం టస్తున్న నాయకులు

నవీపేట,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఎంపీ ధర్మపురి అరవింద్‌ను బుధవారం మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో గోదావరి పరివాహక గ్రామాలలో నీట మునిగిన పంటల గురించి వివరించారు. మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో గోశాల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే మండలంలోని అభంగపట్నం, యంచ, మహంతంలలో వీడీసీ భవనాలు, ప్రహరీ నిర్మాణానికి నిధులు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, ఆనంద్, శ్రీకాంత్, రాజేందర్‌గౌడ్, భూషణ్, శ్రీనివాస్‌గౌడ్, రాము, ప్రవీణ్, గణేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ

ఎడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఆర్పీ క్యాంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాలపై అధికారులు అవగాహన కల్పించారు. విద్యు త్ వినియోగదారులకు ఏ సమస్యలున్నా లైన్‌మెన్‌కు తెలియజేయాలని ఇన్‌చార్జి ఏడీఈ నగేష్ కుమార్ సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా ప్రమాదభరితంగా ఉన్నవాటిని వెంటనే పరిష్కరించి, జీరో యాక్సిడెంట్ లక్ష్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, గాలి దుమారాలు, విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే సమాచారాన్ని ఏఈలకు తెలియజేయాలని కోరారు. తడిగా ఉన్న స్తంభాలను ముట్టుకోవద్దని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైరు ఎటువంటి అతుకులు లేకుండా, ఇనుప రేకుల గుండా వెళ్లకుండా చూడాలన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

బోధన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల నుంచి అదృశ్యమైన బాలుడిని పోలీసులు బుధవారం ఆచూకీ కనుగొని పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. మిలటరీ ఆఫీసర్‌గా తిరిగి వస్తానంటూ స్నేహితుడికి ఉత్తరం అందించి అదృశ్యమైన విద్యార్థిని నిజాంసాగర్ పరిసర ప్రాంతంలో పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

వీఆర్ఈసీలో రక్తదాన శిబిరం విజయవంతం

మాక్లూర్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాల(వీఆర్ఈసీ) సామాజిక బాధ్యతలో భాగంగా హైదరాబాద్‌లోని తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సహకారంతో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో ఫార్మసీ, డిప్లొమా, ఇంజనీరింగ్, ఎంబీఏ విభాగాల నుంచి సుమారు 80 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విద్యార్థులు చూపిన ఈ సేవా స్ఫూర్తిని కళాశాల చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేష్ ప్రిన్సిపాల్ డా.సురేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వడ్లు కొనుగోలు చేయాలి



రోడ్డుపై బైఠాయించిన రైతులు

ఎడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు బుధవారం బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. ఎస్సై తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించగా.. ఉన్నతాధికారులతో మాట్లాడతానని తహసీల్దార్ హామీఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. 10రోజుల క్రితం మండలంలో సహకార సంఘం, ఇందిరాక్రాంతి పథకాల ద్వారా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా, ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తాను కూడా కొనలేదని వారు పేర్కొన్నారు. అధిక వర్షాలతో దిగుబడి తగ్గిందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే గిట్టుబాటు ధరతోనైనా రైతులం నష్టపోకుండా ఉంటామన్నారు.

రైతుల గుండెల్లో వర్షం దడ

మద్నూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరు గాలం శ్రమించిన అన్నదాతకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పడం లేదు. సీజన్ ప్రారంభంలో కాస్త ఆలస్యంగా వచ్చిన వానలు ఆ తర్వాత ఊపందుకోవడంతో సాగు పనులు ముమ్మరంగా జరిగాయి. పంటలు కూడా ఏపుగా పెరిగాయి. దాంతో ఈసారి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులకు గతంలో పడిన వర్షాలు వరదలతో పాటు ప్రస్తుతం పడుతున్న వానలు వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఓ వైపు పత్తి, మరోవైపు సోయా చేతికి వచ్చే దశలో భారీ వర్షాలతో వరదలు వచ్చి పంటలు నష్టపోయాయి. దీంతో రైతులు కంటిమీద కునుకు లేకుండా ఆందోళన పడ్డారు. పత్తి తీత దశలో ఉన్న పత్తి నీరు గారి పోతుండటం రంగు మారిపోతుండటంతో నాణ్యత లోపిస్తుందని అని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా ప్రకృతి రైతు లపై కన్నెర్ర చేస్తుంది. వరుణుడి రూపంలో వారి ఆశలకు గండి కొడుతుంది. పంటలు చేతికొచ్చే దశలో వస్తున్న వానలు వారిని నట్టేట ముంచుతున్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఈ ఏడాది వానాకాలంలో 53 వేల 350 ఎకరాలలో ఆయా పంటలను రైతులు సాగు చేశారు. ఆయా పంటలకు ఎకరానికి రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చులు పెట్టుబడిగా పెట్టారు. రెండు నెలల క్రితం అకాల వర్షాలు వరదలతో మండలంలో సోయా, పత్తి పంటలోకి నీళ్లు రావడంతో పంటలు నష్టపోయాయి. మిగిలిన సోయా పంటను రైతులు కోసుకొని ఇంటికి తీసుకొస్తామంటే ఇటీవల కురిసిన వర్షంతో పంటలు తడిసిపోయాయి. తడిసిన పంటను మార్కెట్ యార్డులో ఆరబెట్టుకుందామంటే రెండు రోజులుగా వాతావరణం మార్పులతో పాటు వర్షం వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతా వరణ కేంద్రం చెప్ప డంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రైతులు పత్తి సోయా పంటలు నష్ట పోయారు. సోయా మిగిలిన పంట వర్షానికి తడిసిపో వడంతో మద్నూర్ మార్కెట్ యార్డులో పంటను ఆర బెట్టుకుంటున్నారు. ఈ సమయంలో కూడా వర్షాలు వస్తాయని తెలపడంతో రైతుల గుండెల్లో వర్షం దడ పుట్టుకొస్తుంది.


మద్నూర్ మార్కెట్ యార్డులో ఆరబోసిన సోయా పంట

సీసీఐ కోసం ఎదురు చూపులు

పత్తి దిగుబడులు ఘననీయంగా తగ్గుతుండటంతో పాటు పండించిన పంటకు ధర కూడా లేక పోవడంతో రైతులకు కష్టానికి తోడుగా నష్టాన్ని చవిచూస్తున్నారు. పంట రంగు మారిందన్న కారణం చూపి ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలు పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లో నిల్వ ఉంచలేక వ్యాపారులు అడిగిన ధరలకే రైతులు అమ్మాల్సిన స్థితి నెల కొన్నది. సీసీఐ ఏర్పాటులో జాప్యం జరుగుతుండడం తో రైతుల వద్ద ఉన్న పత్తి పంట అంతా వ్యాపారుల చేతు ల్లోకి వెళుతుంది. ఆలస్యంగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులుకు అంతంతం మాత్రంగానే ప్రయోజనం చేకూరుతుంది అన్నఅభిప్రాయాలున్నాయి.

సోయా కొనుగోలు ఎప్పుడు

ఉమ్మడి మద్నూర్ మండలంలో ఈ ఏడాది సుమారు 35 వేల ఎకరాలలో రైతులు సోయా పంట సాగు చేశారు. గత రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షానికి వరదలకు పంటలు నష్టపోగా మిగతా పంట కోసుకొచ్చి మద్నూర్ మార్కెట్లో ఆరబోసుకున్నారు. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లయితే రైతులకు గిట్టు బాటు ధర కలుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసిన దృశ్యం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నాయకులు బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. లబ్దిదారులు జాట్ల స్వప్న రాజేశ్‌లు తమకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నార్ల సురేశ్ గుప్త, నార్ల ఉదయ్, ఉప్పరి లింగం, సంగమేశ్వర్, వార్డు ప్రత్యేకాధికారి కృష్ణ తదితరులున్నారు.

వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త


తాండూర్‌లో దోమ పోటు సోకిన వరి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

నాగిరెడ్డి పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాం డూరు గ్రామంలో దోమ పోటుకు గురైన వరి పంట పొలాలను మాల్తుమ్మెద కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనిల్ రెడ్డి, ఏవో సాయి కిరణ్‌లు బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. గ్రా మంలోని పలువురు రైతుల వరి పంటల పైన దోమ పోటు తెగు ళ్లు సోకినట్టు సమాచారం అందడంతో శాస్త్రవేత్త, వ్యవసాయ అ ధికారి గ్రామ శివారులోని వరి పంటలను పరిశీలించారు. రైతు లు తమ వరి పంటపైన దోమ పోటు తెగుళ్లు సోకితే పెమి ట్రో జైన్ 50 శాతం డబ్ల్యుజీ అనే మందు 0.6 గ్రాములు లీటరు నీటి లో కలిపి మొక్క మొదట్లో పడేటట్టు పిచికారి చేసుకోవాలని అధికారులు రైతులను కోరారు. మందును పిచికారి చేసేటప్పుడు పొలంలో నీరు తక్కువ ఉండేటట్టు చూసుకోవాలి, పొలంలో పా యలు తీసి పిచికారి చేసుకోవాలని వారు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగేశ్వర్ రెడ్డి, రమేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సహకరించాలని వినతులు


వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18న తలపెట్టిన తెలంగాణ బీసీ బంద్‌కు జిల్లా ప్రజలు, వ్యాపారులు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సంస్థల ప్రతినిధులను, అసోసియేషన్ సభ్యులను కలిసి బంద్‌కు సహకరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలకు రావాల్సిన న్యాయమైన రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్న రెడ్డి జాగృతికి వ్యతిరేకంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఇది న్యాయపోరాటం అని అన్నివర్గాల వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, నాయకులు కొయ్యాడ శంకర్, బగ్గిలి అజయ్, కోడూరు స్వామి, విజయ్, బాలన్న పాల్గొన్నారు.

అండర్-19 బాల బాలికల నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా బాలికల జట్టు

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ జిల్లా జట్లను బుధవారం ఎంపిక చేశారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహించారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ప్రకటిస్తామని నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, రమేష్‌లు తెలిపారు. బాలికల విభాగంలో అనుప్రియ, సింధు, ప్రతిభ, స్వరూప్, అక్షయ, శృతి, రక్షిత, ప్రణీత, పురందేశ్వరి, సంకీర్తన, కీర్తన, రక్షిత, సింధు, జాహ్నవి, అలేఖ్య, బాలుర విభాగంలో ప్రభాస్, అజయ్‌కుమార్, అర్వింద్, దేవేందర్, అభ్యుదయ, సాయికుమార్, మహేష్, రాహుల్, నవనీత్, అభిలాష్, నిఖిల్, శశికాంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లీగ్‌లో నిజామాబాద్ జట్టు ఘన విజయం


విజయం సాధించిన జట్టు సభ్యులు

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు లీగ్ పోటీలలో నిజామాబాద్ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. శంషాబాద్ లోని బీఆర్‌కే గ్రౌండ్‌లో జై భగవతి తో జరిగిన రెండు రోజుల పోటీలో నిజామాబాద్ జట్టు 494 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది. ఇందులో అజిత్ రాజా 261 పరుగులతో అజేయంగా నిలిచాడు. జై భగవతి జట్టు నిజామాబాద్ బౌలర్ల దాటికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. నిజామాబాద్ జట్టు బౌలర్ మనోహర్ 5 వికెట్లు తీసి ప్రత్యర్థి టీంను కోలుకోకుండా దెబ్బ తీశాడు. విక్రం నాయక్ 2 వికెట్లు తీసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. నిజామాబాద్ జిల్లా జట్టు 389 పరుగులతో ఘన విజయం సాధించింది.

భూ భారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

» కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భూ భారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గ్రామ పాలన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీపీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా క్లస్టర్ల వారీగా భూభారతి పెండింగ్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు జీపీవోలకు అందించారా అని ఆరా తీశారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ క్షేత్ర స్థాయిలో పక్కాగా విచారణ జరపాలని కలెక్టర్ సూచించారు. భూభారతి చట్టంలోని అన్ని మాడ్యుల్స్‌పై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే అర్జీలను త్వరగా పరిష్కరించగల్గుతారని అన్నారు. సాదాబైనమా, పీ.ఓ.టీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను కూడా పూర్తి చేయాలని సూచించారు. భూ వివాదాలు, ఇబ్బందులను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టి రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని గుర్తు చేశారు. అర్జీలను త్వరగా పరిష్కరించి సంబంధిత రైతులకు న్యాయం చేయవలసిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో జీపీవోలు కీలకమైన బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆయా క్లస్టర్ల గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకూడదు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను యాజమాన్యాలు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఈ పథకం కింద ఎంత మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు, ప్రస్తుతం ఎంతమంది కొనసాగుతున్నారు, వివిధ కారణాల వల్ల యాజమాన్యాలు విద్యార్థులు ఎవరినైనా బడి నుంచి బలవంతంగా బయటకు పంపించారా అని కలెక్టర్ ఆరా తీశారు. బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగ స్వాములైన ఆయా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ తీరుతెన్నులు, ఇబ్బందు ల గురించి కూడా కలెక్టర్ యాజమాన్యాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. ఏ ఒక్క విద్యార్థికి సైతం ఇబ్బంది కలుగకుండా వారి ఉజ్వల భవిష్యత్తు కోసం యాజమాన్యాలు తమవంతు తోడ్పాటును అందజేయాలని హితవు పలికారు. విద్యా రంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, బెస్ట్ అవైలబుల్ పథకం అమలవుతున్న పాఠశాలలు కూడా పిల్లలకు విద్యను నేర్పించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠ్యాంశాల బోధన, వసతుల కల్పన విషయంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులు పట్ల వివక్షను ప్రదర్శించ కూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. బకాయిల చెల్లింపుల విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన వసతుల కల్పనకు చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, సంక్షేమ శాఖల అధికారులు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం అమలవుతున్న పాఠ శాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవిని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కేటాయించాలి


రాజ్‌పాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవిని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కేటాయించాలని కోరుతూ బుధవారం ఏఐసీసీ పరిశీలకులుగా వచ్చిన రాజ్‌పాల్‌కు ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అత్యంత సేవలు అందించి ఎన్నో పదవులు చేపట్టిన ప్రజాసేవలో ఉన్న మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన బొంబోతుల లింగాగౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలన్నారు. ప్రతీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరిని ఏకతాటిపై నడిపిస్తున్న పేరున్న నాయకుడు లింగాగౌడ్ అని, ఆయనకు ఈ పదవిని కట్టబెడితే పార్టీని ప్రతీ దాంట్లో విజయం వైపు నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివరెడ్డి, సీడీసీ చైర్మన్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, మండల మాజీ వైస్ ఎంపీపీలు గాదారి శ్రీనివాస్‌రడ్డి, రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లూరులో పిట్లం జోనల్ పోటీలు


ఖోఖో పోటీల్లో పాల్గొన్న అండర్ - 14, 17 బాల బాలికలు వీరే

నిజాంసాగర్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): పిట్లం జోనల్ ఖో ఖో పోటీలు బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లూరులో నిర్వహించారు, ఈ పోటీలలో నిజాంసాగర్ పిట్లం, పెద్దకొడపగల్ మండలాలకు సంబంధించిన అండర్ 14, అండర్-17 కేటగిరిలలో బాల బాలికలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను. జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగింది అని మండల ఇన్చార్జి విద్యాధికారి తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలో మల్లూరు ఉపాధ్యాయుల ఫిజికల్ డైరెక్టర్‌లు రాజు, జావీద్, సంజీవ్, సంతోష్, సాయిలు, ధర్మేందర్, ప్రియాంక, అన్నపూర్ణ, రాజు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రజితారెడ్డి

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం సాధారణ కమిటీ సమావేశం చైర్‌పర్సన్ మారెడ్డి రజితరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను కార్యదర్శి శ్రీనివాస్ చదివి వినిపించారు. అనంతరం పాలకవర్గం లింగంపేట మండలం లింగంపల్లి వద్ద అదనంగా ఐదు వేల గోదాం నిర్మించుట, అదేవిధంగా నాగి రెడ్డిపేట వద్ద వే బ్రిడ్జి నిర్మించుట గురించి తీర్మానం చేసినట్లు తెలిపారు. అనంతరం ఖరీఫ్ 2025-26. సంవత్సరానికి సంబంధించిన మద్దతు ధర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకెళ్లి విక్రయించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జొన్నల రాజు, డైరెక్టర్లు నాగం శంకరయ్య, గంగా రెడ్డి, గోపాల్, హరి నారాయణ, శ్రీనివాస్, ఫుల్ సింగ్, నగేష్, లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వాసవి సేవా సమితి సభ్యులు

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద ప్రతిభకలిగిన ఆర్యవైశ్య విద్యార్థులకు వాసవి సేవా సమితి సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలోని అర్వపల్లి పురుషోత్తం కళ్యాణ మండపంలో వాసవి సేవా సమితి ట్రస్ట్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు అర్వపల్లి పురుషోత్తం గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్య కులంలో ఉన్న నిరుపేద ప్రతిభకలిగిన విద్యార్థులకు చేయూతనివ్వడం కోసం విద్యనిధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నిధి నుంచి 20 మంది విద్యార్థులకు 21వేల చొప్పున చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా రెండు సంవత్సరాల్లో సుమారు 100 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. విద్య ద్వారానే చైతన్యం వస్తుందని ఆలోచనతో ట్రస్ట్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పురుషోత్తం అన్నారు. పేద, తల్లిదండ్రులు లేని ప్రతిభకలిగిన విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, ముక్క వినోద్, లక్ష్మీకాంతం, పాల్దె రాజేశ్వర్, మోటూరి మురళి, విశ్వనాథం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేత


విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న కుంట రాఘవరెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2023-24, 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆత్మకూర్ గ్రామానికి చెందిన మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కుంట రాఘవరెడ్డి బుధ వారం నగదు బహుమతిని అందజేశారు. ఆత్మకూర్ పాఠశాలలో 2023-24, 2024-25 రెండు విద్యా సంవత్సరాల్లో ఎస్సెస్సీ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన రజిత, ప్రవంతి విద్యార్థినిలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థులు రామ్ చరణ్, భూమయ్యలకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు రాకేష్, గౌతమిరెడ్డి, అనన్య, సహస్రలకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బెంచీల ఏర్పాటు కోసం రూ.40 వేల నగదు ఆర్థిక సహాయాన్ని ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందజేశారు. రాఘవరెడ్డి ఈ ఆర్థిక సహాయాన్ని ఆయన తల్లిదండ్రులైన క్రీస్తుశేషులు కుంట సంగారెడ్డి, సాయమ్మల పేరిట అందజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జబీన్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు


బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నుంచి నాయకులు , కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఆ పార్టీ ఇంచార్జి యెండెల లక్ష్మీనారాయణ, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చినరాజులు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ పార్టీలో చేరిన వారిలో రైతునగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాజేశ్, మాజీ వార్డు సభ్యుడు నర్సాగౌడ్ , మొగులయ్య , బుక్కారెడ్డి , మహేంద్ర , ప్రసాద్ , శివరాజ్‌లతో పాటు 30 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై బీజేపీ లో చేరినట్లు తెలిపారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నాగెల్ల సాయికిరణ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షుడు చిదుర సాయిలు, శ్రీనివాస్ , లక్ష్మీనారాయణ , పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి , నాయకులు , కార్యకర్తలు తదితరులున్నారు.

18న నాయిబ్రాహ్మణ దుకాణాల మూసివేత

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ పిలుపు మేరకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన బంద్‌కు జిల్లా నాయిబ్రాహ్మణ క్షౌరవృత్తుల వారు సంపూర్ణ మద్దతు ఇస్తుందని యూనియన్ అధ్యక్షుడు దేశాయి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ సాధించడానికి బీసీ కులాలంతా ఏకతాటిపైకి వచ్చేందుకు దుకాణాలను మూసివేస్తూ నిరసన తెలపాలని అన్నారు.

జీజీ కాలేజీలో రోబోటిక్స్‌పై కార్యశాల



కళాశాల ఎదుట విద్యార్థులు

ఇందూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో, సోహం అకాడమి హైదరాబాద్ సౌజన్యంతో రోబోటిక్స్‌పై ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జీజీ కళాశాలలో రోబోటిక్ కార్యశాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రంగరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో రోబోటిక్స్ చాలా ప్రాధాన్యత సంతరించుకుందని భవిష్యత్తులో అన్ని దయనందిన కార్యక్రమాల్లో రోబోల వాడకం సర్వసాధారణం అవుతుందని తెలిపారు. ఈ కార్యశాలలో 70 మంది విద్యార్థులు శిక్షణ పొందగా ట్రైనర్లుగా సోహమ్ అకాడమి ప్రతినిధులు సందీప్, మల్లికార్జున్, రాజవర్ధన్, అక్షయ్‌లు వ్యవహరించారు. ఆర్‌టీనో యూనో మైక్రో కంట్రోలర్‌పై 21 రకాల ప్రయోగాలను విద్యార్థులకు కార్యశాలలో శిక్షణ ఇచ్చామని సమన్వయకర్త పి.రామకృష్ణ తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు నిజామాబాద్ పరిసరాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చే అభ్యర్థులకు పారితోషికం అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఇతర ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేస్తామని సోహమ్ అకాడమి డైరెక్టర్ కోమరగిరి సహదేవ్ తెలిపా రు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్, సమన్వయకర్త డాక్టర్ రాజేష్, గణిత విభాగాధిపతి జయప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కిరణ్‌కుమార్‌గౌడ్, అధ్యాపకులు పద్మ, రాములు, వాణి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఎస్బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంప్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా భవానీ ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని బుధవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఎస్‌బీఐ సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆనంద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల సురేష్‌గుప్తా, నాయకులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, శ్రీశైలం, మంద శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యాలయంలో కామారెడ్డి పట్టణ దళితమోర్చా నూతన కార్యవర్గాన్ని దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు సంగీ రాజేందర్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రాజు, నవీన్, కిషన్, కల్లూరి రూపేష్, ప్రధానకార్యదర్శులుగా నవీన్, పెరుమాండ్ల గంగోలి, కార్యదర్శులుగా రవీందర్, సత్యనారాయణ, అశోక్, నాగరాజు, నరేందర్, కార్యవర్గసభ్యులుగా సుతారి స్వామి, గణేష్, శేఖర్, భరత్, శివకుమార్, రవి, శివ, శివరాజు, శంకర్, రాకేష్, సన్ని, బాలనర్సు, పడిగే కుమార్, శ్రీకాంత్, రేణుక, గీత, ప్రియాలను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా నవీన్

పాల్వంచ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓపెన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణులుగా పల్వంచ గ్రామానికి చెందిన గరిగే నవీన్ ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 18 వరకు హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో జరిగే 23 సంవత్సరాల జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటిలకు సాంకేతిక నిపుణులుగా కామారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నాడు. జిల్లా నుంచి ఎంపికైన నవీన్‌ను అథ్లెటిక్స్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, సెక్రటరీ అనిల్‌లు అభినందించారు.

మున్నూరు కాపు సంఘం శాశ్వత సభ్యత్వ కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుసంఘం శాశ్వత సభ్య కార్డులను బుధవారం సంఘం రాష్ట్ర అపెక్స్ కమిటి మెంబర్ మామిండ్ల అంజయ్య, రాష్ట్ర సెక్రటరీ నీలం నర్సింలు పంపిణీచేశారు. నల్లమడుగు గ్రామానికి చెందిన రిటైర్డ్ సీఐ రాఘవులు, కోనాపూర్ గ్రామానికి చెందిన రాజేష్, అశోక్‌నగర్ పెట్టిగాడి అంజయ్యకు కార్డులు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముదాం భీమేష్, రాష్ట్ర వాణిజ్య ఉపాధ్యాక్షుడు మామిండ్ల లింగం, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాజలింగం, రాజేష్, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

దోమకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన వాసవిక్లబ్ బీబీపేట సభ్యుడు శ్రీపప్పుల శంకర్ మృతిచెందగా వాసవి సొసైటీ నుంచి రూ.10 వేలు, అంతర్జాతీయ వాసవి క్లబ్‌నుండి రూ.25 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ గవర్నర్ గట్టురాణి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్యాలయం మంజూరు చేయాలి



లేబర్ కార్యాలయాన్ని మంజూరు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న భవన కార్మికులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో లేబర్ కార్యాలయాన్ని మంజూరు చేయాలన కోరుతూ బుధవారం ఎల్లా రెడ్డి మండలానికి చెందిన పలువురు భవన నిర్మాణ రంగాల సం క్షేమ మండలి అసి స్టెంట్ కమిషనర్ వెంకట్‌రెడ్డికి హైదరాబాద్‌లో విన తిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన ని ర్మాణ కార్యాలయం లేకపోవడంతో కార్మికులకు ఇబ్బందులు తలెత్తుతు న్నాయని, ఎల్లారెడ్డిలో స్థలం కేటాయించి కార్యాలయ భవన నిర్మాణం కోసం నిధులను మంజూ రు చేయాలని కోరారు. బాన్సువాడ కార్యాలయం లో కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దానబోయిన శ్యాం, నిమ్మ కృష్ణ, తుకారాం, సంగమేశ్వర్, సాయిలు, హన్మంతు, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గాంధారి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం లోని నేరేల్ తండాకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్- 14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్ బుధవారం తెలిపారు. గాంధారి మండలంలోని నేరేల్ తండాకు చెందిన లోకేష్, ప్రేమ్‌సింగ్ జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఈ మేరకు విద్యార్థులను నేరేల్ తండా వాసులు అభినందించారు.

ఆకలిని తీరుస్తున్న ఆలయం

మనుషుల గుండెల్లో దైవత్వం నిండితే అది సేవా రూపంలో వ్యక్తమవుతుంది. ఆకలితో ఉన్న పేదవాడికి ఒక ముద్ద అన్నం పెట్టడం, దేవాలయంలో దీపాలు వెలిగించడంతో సమానం. ఇదే తత్వాన్ని ఆలంబనగా చేసుకుని బాన్సువాడ అయ్యప్ప స్వామి ఆలయం కేవలం భక్తి కేంద్రంగానే కాకుండా నిరుపేదల కడుపు నింపే గొప్ప అన్నక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆకలితో అలమటించే వారికి అన్నప్రసాదాన్ని అందిస్తూ ఎనిమిదేళ్లుగా అన్నయజ్ఞం కొనసాగిస్తుంది.

- బాన్సువాడటౌన్ , ఆంధ్రజ్యోతి



బాన్సువాడ అయ్యప్ప ఆలయం వద్ద బారులు తీరిన జనం



అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అర్ధాంతరంగా నిలిచిన లైబ్రరీ నిర్మాణం

- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

నసురుల్లాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. కొన్నేళ్ళ క్రితం స్థానిక గ్రామ పంచాయితీ భవనంపైన రూ.10లక్షలతో భవనం నిర్మాణం పనులు ప్రారంభించారు. అనుకున్న దాని కన్న పెద్దగా లైబ్రరీ భవనం రావడంతో నిధులు చాలక పనులు నిలిచిపోయాయి. పాలకుల పనితనంతో లైబ్రరీ ప్రారంభానికి నోచుకోకుండా పోయింది.



మిర్జాపూర్‌లో అర్ధాంతరంగా నిలిచిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే ఉంది. దీంతో మిర్జాపూర్, వీరాపూర్ దుబ్బా గ్రామాల ప్రజలు చదువుకోవడానికి ప్రదేశం లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. గతంలో లైబ్రరీ ఉన్న శిథిలావస్థ భవనంలో సైతం విద్యార్థు లు ఇబ్బందులు పడుతున్నారని, నూతనంగా భవ న నిర్మాణం ఏర్పాటు చేసినప్పటికీ అది అర్ధాంతరంగానే నిలిచిపోయింది. కాగా మిర్జాపూర్ గ్రామ విద్యార్థులు ఉన్నత చదువు చదవాలన్నా, కాంపిటీటివ్ పరీక్షలు పాస్ అవ్వాలన్న చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం కావాల్సి ఉంటుంది. కాని లైబ్రరీ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులు బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వ స్తుందని యువకులు వాపోతున్నా రు. ఉదయం వెళ్లి సాయంత్రం వ చ్చే వరకు జర్నిలోనే అలిసిపోతున్నామని, దీంతో చదువుపై శ్రద్ధ పెట్టలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో ఐదు లక్షలు అవసరం

గ్రామంలో నిర్మాన దశలోనే ఆగిపోయిన లైబ్రరీ భవనం పూర్తి కావడానికి మరో ఐదు లక్షలు నిధు లు అవసరం అవుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. గతంలో కేటాయించిన పది లక్షలతో పను లు జరిగాయని, మరో ఐదు లక్షలు కేటాయిస్తే లైబ్రరీ పూర్తి అవుతుందని ప్రజలు ఆశాభావం వ్య క్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో లైబ్రరీ భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని యువకులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేసి లైబ్రరీని వాడుకలోకి తీసుకురావాలి



గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన లైబ్రరీ పనులను అధికారులు పూర్తి చేసి, లైబ్రరీని ప్రారంభించి వాడుకలోకి తీసుకురావాలి. గ్రామంలో లైబ్రరీ లేకపోవడంతో యువకులు ఇబ్బంది పడుతున్నారు.

- జంగిలి శ్రీనివాస్,మిర్జాపూర్, గ్రామస్థుడు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పించుకోవాలి

తాడ్వాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశు వులకు ఖచ్చితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇప్పిం చుకోవాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్ రవితేజ తెలిపారు. కామా రెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో బుధ వారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించు కోనట్లయితే పాల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ప్రతి రైతు విధిగా తమ పశువులకు టీకాలు ఇప్పించాలని ఆయన సూచించారు. జిల్లా పశువైద్యాధికారి భాస్కర్ మాట్లాడుతూ పశు వులకు గాలికుంటు వ్యాధి వస్తే పశువుల కాళ్ళ గెటికలకు, నోటిలో పుండ్లు ఏర్పడతాయన్నారు. దీంతో పశువులు సరిగ్గా మేత మేకపోవడంతో బలహీన పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి రమేష్, సిబ్బంది పోచయ్య, కొండల్ రెడ్డి, ప్రేమ్ సింగ్, గోపాల మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



తిప్పాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న సిబ్బంది

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 15నుండి నవంబరు 11 వరకు ప్రతిగ్రామంలో పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి మండలంలోని అన్ని ఆవులు, గేదేలు, దూడలకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలను వేయ్యడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోట్లో పుండ్లు ఏర్పడటం, కుంటడం, మేత సరిగ్గా మేయ్యక పోవడం, పాలు తక్కువగా ఇవ్వడం జరుగుతుందన్నారు. తిప్పాపూర్‌లో 188పశువులకు ఈ టీకాలను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మోహన్, భరత్, ప్రదీప్, మహేష్‌గౌడ్, సురేష్, సందీప్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు

రామారెడ్డి: మండల కేంద్రంలో బుధవారం గాలికుంటు టీకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాంచందర్ మాట్లాడారు. గాలికుంటు టీకాలను నవంబర్ 14వ తేదినిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం 30 గోజాతి, 360 గేదెజాతి పశువులకు టీకాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, వీఎల్‌వో నారాయణ, జేవీ వో రమేష్, వీపీ బాలమణి, దశరథ్, హారిక, రవీందర్‌రెడ్డి, స్వామి, గ్రా మానికి చెందినపాడి రైతులు పాల్గొన్నారు.

రామేశ్వర్‌పల్లిలో అబ్దుల్ కలాం జయంతి

భిక్కనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్ర కాంత్‌రెడ్డి, వీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్ర కరణ్ రెడ్డి, విండో చైర్మన్ నాగర్తి భూంరెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ సూర్య కాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, ఆయాపార్టీల నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వర్‌పల్లిలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. దేశరక్షణకు క్షిపణులు తయారు చేయడమే కాకుండా యువతకు కలలు కనండి వాటిని నెరవేర్చుకునేందుకు కృషిచేయండని ని నదించిన గొప్ప వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకుకు తాళం

మహమ్మద్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం లోని యూని యన్ బ్యాంకులో కరెంట్ అంతరాయం కలగడం, నెట్‌వర్క్ పనిచేయక పోవడంతో బుధవారం బ్యాంకు సేవ లను నిలిపివేశారు. ఈ మేరకు బ్యాంకుకు తాళం వేయడంతో ఖాతాదారులు ఎండలోనే నిరీక్షించారు. ఈ సందర్భంగా ఖాతా దారులు మాట్లాడుతూ ఈ యూనియన్ బ్యాంకులో గత కొం తకాలంగా ఇవే విధంగా చేస్తూ ఖతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బ్యాంకు మేనేజర్ సెలవుల్లో ఉండటం, ఫీల్డ్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతోనే నెట్‌వర్క్ సమస్య ఉందని అబద్దాలు చెబుతూ బ్యాంకుకు తాళం వేశారని ఆరోపించారు.



మూసిఉన్న యూనియన్ బ్యాంకు

పాఠశాలకు సదుపాయాలు కల్పించిన పూర్వ విద్యార్థులు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని దేశాయిపేట గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్న పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు బుధవారం మహమ్మద్‌నగర్ ఎంఈవో వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజు, ప్రసాద్, సంజీవ్ పోడియం, సౌండ్ సిస్టం, బేంచీలను అందజేవారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నివేదిత మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటుగా పూర్వవిద్యార్థుల సహకారంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పొత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విష్ణు, అమర్‌సింగ్, ప్రసాద్, చంద్రకళ, గాయత్రి, జాగృతీ, హన్మాండ్లు, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలకు సౌండ్‌సిస్టంను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

ఘోరం

(7వ పేజీ తరువాయి)

ప్రయాణికులు కన్నీరుపెట్టుకున్నారు. ఎక్క డి నుంచి వస్తున్నారో ఎక్కడికి వెళ్తున్నారో ఇంత హోరం జరిగిపాయే, టిప్పర్ తాగి నడిపిండా కండ్లు కన్పించలేవా అంటూ శాపనార్థాలు పెట్టారు.

పోలీసుల అదుపులో టిప్పర్ డ్రైవర్...

రాంగ్‌రూట్‌లో వచ్చి నలుగురి ప్రాణాలు పోవడానికి కారకుడైన టిప్పర్ డ్రైవర్ రాజి రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి బీడీ కాలనీకి చెందిన రాజిరెడ్డి రమేష్ దగ్గర గత కొంతకాలంగా టిప్పర్ నడిపిస్తున్నాడు. స్కూటీని ఢీకొన్న అనంతరం అతడు టిప్పర్‌ను కొంత ముందుకు రోడ్డు పక్కనకు నిలిపివేసి ప్రమాదస్థలి వద్దనే ఉన్నాడు. పోలీసులు అక్కడికి చేరుకోగానే టిప్పర్ డ్రైవర్ నేనే అంటూ పోలీసులకు లొంగిపోయాడు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ

రోడ్డు ప్రమాద స్థలాన్ని కామారెడ్డి రూరల్ సీఐ రామన్ పరిశీలించారు. ఈ మేరకు రోడ్డు ప్రమాదం జరిగిన తీరును ఎస్సై ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎస్సై రాజు, భిక్కనూరు ఎస్సై-2 నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి

(7వ పేజీ తరువాయి)

ఆర్థిక సహాయం అందించే విషయంలో ఐకేపీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావలసిన ఇసుకను సరఫరా చేయడంలో సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దారులు తగు చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను రాబోవు 15 రోజులలో పూర్తి చేసేలా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గల అధికారులకు పూర్తి బాధ్యత వహించే విధంగా ఆయా స్థాయిల్లో పని విభజన చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక సంస్థల కలెక్టర్ చందర్‌నాయక్, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ సురేందర్, డీపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

విధులు నిర్వహించని..

(7వ పేజీ తరువాయి)

తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

మహమ్మద్‌నగర్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని లేనియెడల చర్యలు తప్పవని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో మురికికాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించి వారి వివరాలను సేకరించి ప్రొసీడింగ్ వెంటనే ఇవ్వాలన్నారు. బేస్మిట్ కాగానే బిల్లులు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతంగా కొనసాగేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శులు అంజయ్య, బలరాములు, ప్రేమ్‌సింగ్, గంగాధర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మాచారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ హుండీని బుధవారం ఏసీ విజయ రామారావు, ఆలయ చైర్మన్ కమలా కర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70రోజులకు సంబంధించిన హుండీని లెక్కించగా రూ.3,36,278లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభురాంచంద్రం, అర్చకులు, సిబ్బంది, గ్రామ మహిళా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతారా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230